మంచిర్యాలలో మార్కెట్ కూల్చివేత!

ప్రభుత్వ నిర్మాణాన్ని కూల్చుతున్న అధికారులు • కొత్త దవాఖాన నిర్మాణం పేరిట విధ్వంసం • కేసీఆర్ హయాంలో నిర్మాణం ప్రారంభం

మంచిర్యాల, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి అధికారిక పార్టీ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు (పీఎస్సార్) తెరలేపారు. మాతా, శిశు హాస్పిటల్ ఏర్పాటు పేరిట జిల్లా కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను గురువారం నుంచి కూల్చివేయిస్తున్నారు (ఇం కా కొనసాగుతున్నది). గత ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీకి ఒక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఉండాలన్న ఉద్దేశంతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఈ నిర్మాణాన్ని చేపట్టింది. ఇందుకోసం రూ.7.20 కోట్లు కేటాయించి, దాదాపు రూ.4 కోట్ల విలువ చేసే పనులను కూడా పూర్తి చేసింది. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. ఇప్పుడు ఆ భవనాన్ని అర్ధాంతరంగా కూలుస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఉన్న రెండెకరాల ఆరు గుంటల భూమితోపాటు దాని వెనక ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, ఆర్డీవో కార్యాలయం ఉన్న భవనం సహా వాటర్ ట్యాంక్ మొత్తం 4.22 ఎకరాలు ఇప్పుడు నూతన హాస్పిటల్ నిర్మాణానికి ఇచ్చారు. దీంతో ఈ రోజు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూలుస్తుండగా.. త్వరలో రూ.3 కోట్లతో నిర్మించిన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ (ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కార్యాలయానికి కేటాయించారు), రూ.3 కోట్లు విలువ చేసే పాత ఆర్‌అండ్‌బీ ఆఫీస్ భవనాలను కూడా కూల్చనున్నట్టు తెలిసింది. హాస్పిటల్ నిర్మాణం పేరిట దాదాపు రూ.10 కోట్ల విలువైన ఆస్తులను కూలుస్తుండటంపై స్థానికులు మండిపడుతున్నారు.

జీవో రాకముందే కూల్చివేతలు

4.22 ఎకరాల్లో హాస్పిటల్ నిర్మించాలంటే మున్సిపాలిటీ సహా ఆర్‌అండ్‌బీ శాఖలు ఆ భూమిని టీఎస్ఎంఐడీసీ (తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)కు అప్పగించాలి. ఈ మేరకు మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ శాఖలు ఆ భూమిని టీఎస్ఎండీసీకి ఇస్తున్నట్టు లేఖలు అందజేశాయి. కానీ.. దీనిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సర్కారు ఆర్డర్ రాలేదని, ఎలాంటి ఆదేశాలు రాకముందే ఇలా కూల్చివేతలు చేస్తున్నారని టీఎస్ఎండీసీకి అనుసంధానంగా పని చేసే జిల్లా అధికారి ఒకరు తెలిపారు. ఇలా ఏ ఆర్డర్ లేకుండా ఎలా కూల్చేస్తున్నారనేది అర్థం కావడం లేదు. అసలు ఆ అధికారం వీరికి ఎవరిచ్చారు? అనే ప్రశ్నకు సమాధానం దొరకలేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూల్చివేస్తుండటంపై మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌ను వివరణ కోరగా.. కూల్చివేతల విషయం మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ వాళ్లే చూసుకుంటున్నారని చెప్పారు. తమకు ఈ విషయంలో సంబంధం లేదని, కూల్చివేత పర్మిషన్లు కూడా వాళ్లే తీసుకుంటారని స్పష్టంచేశారు. ఇదే విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ రమేశ్‌ను వివరణ కోరగా.. స్థలాన్ని టీఎస్ఎండీసీకి అప్పగించామని, కూల్చివేతపై తమకు ఎలాంటి నోటీసు రాలేదని, అది పూర్తిగా మెడికల్ అండ్ హెల్త్ అధికారులే చూసుకుంటున్నారని చెప్పారు. తమ కార్యాలయాలు ఖాళీ చేసేందుకు 15 రోజుల సమయం ఇచ్చారని, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు మాత్రం అధికారికంగా తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని పేర్కొంటున్నారు. ఇలా ఏ శాఖ అధికారిని అడిగినా ఎవరికి వారు కూల్చివేతపై తప్పించుకునే సమాధానాలు చెప్పడం గమనార్హం. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చడానికి ముందు మంచిర్యాల మార్కెట్‌రోడ్డులో సెట్‌బ్యాక్ లేకుండా ఉన్న నిర్మాణాలను కూడా మున్సిపల్ అధికారులు కూల్చారు. దీంతో కూల్చివేతలపై స్థానికులు మండిపడుతున్నారు.

మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలను కూల్చివేస్తున్న జేసీబీలు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఎందుకు ఆగింది?

ప్రజలకు సుస్థిరమైన పాలన అందించడంలో ఈ ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన మంచి పనులన్నీ ఆగిపోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది. మంచిర్యాల ప్రజల కోసం తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ మొండి గోడలతో కనపడుతున్నది. ప్రజలకు ఉపయోగపడే ఈ బిల్డింగ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆపేసింది. ఏ కారణంతో ఆపేసిందో చెప్పాలె.

-మంచిర్యాలలో మే 4న పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్

రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా రేవంత్‌రెడ్డి

- తన నిర్ణయాలతో విధ్వంసం సృష్టిస్తున్నాడు
- మూసీని రియల్ ఎస్టేట్‌కు అప్పగించేందుకే కూల్చివేతలు
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని దెబ్బతిస్తున్నారు
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపణ

హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేస్తున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపించారు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా తనకు లబ్ధిచేకూరే నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టించడానికే కూల్చివేతలు చేపట్టాడని, అవినీతి సొమ్మును ఢిల్లీకి పంపిస్తున్నాడని చెప్పారు. ఎమ్మెల్యే వివేకానంద గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. మూసీని రియల్ ఎస్టేట్ వాళ్లకు అప్పగించడానికే పేదల ఇండ్లను కూల్చివేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నగరాన్ని బీఆర్ఎస్ హయాంలో సుందరంగా తీర్చిదిద్దితే.. ఇప్పుడు సర్వనాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచిందని, దాంతో అనేక ప్రపంచస్థాయి కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టాయని అన్నారు. కానీ ఇప్పుడు ఉన్న కంపెనీలు వెళ్లిపోయే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. సీఎం తీసుకునే అనాలోచిత నిర్ణయాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. హైదరాబాద్ ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని, ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి కూల్చివేతలు చేస్తారేమోనని ఆందోళన చెందుతున్నారని చెప్పారు. హైదరాబాద్ నగరం నుంచి ఒక్క మంత్రి లేడని, శాఖలన్నీ సీఎం వద్దనే ఉన్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు హడావుడిగా నగరంలో పలు పనులకు శంకుస్థాపనలు చేసి వదిలేశారని, మిగిలిన పనులన్నీ అరకొరగా జరుగుతున్నాయని చెప్పారు. రేవంత్‌రెడ్డి విధ్వంసకర నిర్ణయాలతో హైదరాబాద్ ప్రతిష్ఠ మసకబారుతున్నదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై బీఆర్ఎస్ పోరాడుతుందని పేర్కొన్నారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్, పక్కన కిశోర్‌గౌడ్, బాలరాజుయాదవ్

ఈడీ కేసు మాఫీకేనా అదానీతో భేటీ?

- పొంగులేటి ఇంట్లో 1600 కోట్లు దొరికింది నిజమేనా?
- రెయిడ్స్‌పై ఈడీ ఎందుకు వివరాలు వెల్లడించడంలేదు
- కొండాసురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలి
- బీఆర్ఎస్ నేత దాసోజు డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అతి పెద్ద పారిశ్రామికవేత్త, బీజేపీకి సన్నిహితునిగా పేరొందిన గౌతమ్ ఆదానీతో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కర్ణాటక ప్రభుత్వ సలహాదారు సునీల్ కనుగోలు రహస్యంగా భేటీ కావడం వెనుక అంతర్యం ఏమిటో వెల్లడించాలని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈడీ కేసులను మాఫీ చేసేందుకే అదానీని పొంగులేటి కలుసుకున్నారా అని అనుమానం వ్యక్తంచేశారు. దాసోజు శ్రవణ్ గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ రెయిడ్స్ జరిగాయని, ఈ దాడుల్లో రూ.1600 కోట్లు దొరికినట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నదని అన్నారు. బంగారం కూడా పెద్దమొత్తంలో దొరికినట్టు తెలిసిందన్నారు. పొంగులేటి ఇంటిపై ఈడీ రెయిడ్స్ తర్వాత ఏం జరిగిందో ప్రజలకు చెప్పాలని కోరారు. ఈడీ దాడుల వివరాలను ఇంతవరకు ఎందుకు బయటపెట్టడంలేదని అనుమానం వ్యక్తం చేశారు. గౌతమ్ అదానీని అడ్డం పెట్టుకుని ఈడీ కేసుల నుంచి బయటపడేందుకు పొంగులేటి ప్రయత్నిస్తున్నారా? అని సందేహం వ్యక్తం చేశారు. మంత్రి కొండా సురేఖ మాటలు వింటే రాజకీయాల పట్ల అసహ్యం కలుగుతున్నదని అన్నారు. ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణపై పరివాహక ఎమ్మెల్యేలతో మీటింగ్ ఎందుకు పెట్టలేదు' అని ప్రశ్నించారు.

ప్రభుత్వ చీఫ్ విప్‌గా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

- మరోసారి నిబంధనలకు విరుద్ధంగా నియామకం
- కాంగ్రెస్‌లో చేరిన వారికి నిన్న పీఏసీ చైర్మన్, నేడు చీఫ్‌విప్
- ఫిరాయింపులపై ఇప్పటికే బీఆర్ఎస్ ఫిర్యాదు... చర్య తీసుకోని మండలి చైర్మన్

హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా గెలిచిన పట్నం మహేందర్‌రెడ్డిని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్‌గా నియమించింది. ఈ నియామకం గత మార్చి 15 నుంచి అమల్లోకి వస్తుందని గెజిట్ విడుదల చేసింది. గెజిట్‌ను ఇన్నాళ్లూ రహస్యంగా ఉంచిన ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. తమ పార్టీ నుంచి అర్హులైన శాసనమండలి సభ్యులు లేరనే నిస్సహాయ స్థితిలో బీఆర్ఎస్ సభ్యుడికి కీలక పదవి ఇచ్చింది. ఎన్నికలకు ముందు పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి సునీతా మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఆమె మల్కాజ్‌గిరి ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. పట్నం మహేందర్‌రెడ్డి పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరారని, ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ గతంలోనే శాసన మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేసింది. ఆయనపై ఇప్పటివరకు ఎలాంటి చర్య తీసుకోకపోగా తాజాగా శాసనమండలి చీఫ్ విప్‌గా నియమించారు. ప్రతిపక్ష పార్టీ నుంచి ఎన్నికైన సభ్యుడిని ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఎలా నియమిస్తారని బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తున్నది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన అరికెపూడి గాంధీని అసెంబ్లీలో పీఏసీ చైర్మన్‌గా నియమించారని, దానిపై స్పీకర్ ఇంకా ఎలాంటి సమాధానం ఇవ్వకముందే మరొకరికి ఇలా అవకాశం ఇవ్వడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. దీనిపై మరోసారి మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేయాలనే ఆలోచనలో ఉంది. గత మార్చి 15 నుంచే మహేందర్ రెడ్డి నియామకం అమల్లోకి వస్తుందని గెజిట్‌లో ప్రభుత్వం పేర్కొన్నది. అయితే అదే ప్రభుత్వం... పట్నం మహేందర్‌రెడ్డి, జూన్ 2, ఆగస్టు 15న రెండు సార్లు జాతీయ జెండాను ఎగురవేయడానికి మేడ్చల్ జిల్లాలో అవకాశం కల్పించారు. ఆ ప్రభుత్వ ఆదేశాల్లో మాత్రం మహేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగానే పేర్కొన్నారు. ప్రభుత్వమే ఒక పదవి ఇచ్చి, ఆ పదవిని తాను ఇచ్చే ఆదేశాల్లో పేర్కొనకపోవడం గమనార్హం.

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో పర్యటించి ఫార్మాసిటీ ఏర్పాటుకు సేకరించిన పంట భూములను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నాయకులు చంటి క్రాంతికిరణ్, దేవీప్రసాద్, మఠం భిక్షపతి, శివకుమార్, పట్నం మాణిక్యం తదితరులు

నువ్వు సీఎంవా.. బ్రోకర్‌వా?

అండగా నిలవాల్సిందిపోయి రైతుల భూములు లాక్కుంటున్నవ్ • పిచ్చోడి చేతిలో రాయిలా పాలన: హరీశ్

- మూసీని ఉద్ధరించి.. మంజీరను విషతుల్యం చేస్తరా?
- అసైన్డ్‌భూములకు పట్టాలిస్తామన్న రాహుల్ సమాధానం చెప్పాలి
- జేసీబీలు, పొక్లెయిన్లు వస్తే నేను అడ్డుగా పడుకుంటా
- రైతుల పక్షాన గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టులో కేసులు వేస్తం
- రేవంత్‌రెడ్డి మెడలు వంచి భూములు కాపాడుతం
- డప్పూరులో మాజీ మంత్రి హరీశ్
- భూముల పరిశీలన, రైతులతో ముఖాముఖి
- కంటతడిపెట్టిన బాధిత రైతులు, మహిళలు

విలపిస్తున్న భూ బాధిత మహిళలు

సంగారెడ్డి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డీ.. నువ్ ముఖ్యమంత్రివా.. రియల్ ఎస్టేట్ బ్రోకర్ వా అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లాలోని డప్పూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఫార్మాసిటీలో కోల్పోతున్న రైతుల భూములను హరీశ్‌రావు పరిశీలించారు. అనంతరం ఫార్మాసిటీలో భూములు కోల్పోతున్న డప్పూరు, వడ్డీ, మాల్గి రైతులతో సమావేశమయ్యారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మూడు పంటలు పండే బంగారంలాంటి మా భూములను ఫార్మాసిటీకి ఇవ్వబోమని, అవసరమైతే ప్రాణాలిస్తామని రైతులు, మహిళలు కంటతడి పెట్టారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ గరీబీ హటావో అంటే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో గరీబ్, కిసాన్ హటావో అంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హైదరాబాద్ సమీపంలో ఫార్మాసిటీ కోసం 15వేలు ఎకరాలు సేకరించటంతో పాటు అన్ని అనుమతులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. అక్కడ ఫార్మాసిటీ నిర్మించకుండా ఆ భూములను ప్లాట్లుగా చేసి అమ్ముకుని డబ్బు చేసుకోవాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. న్యాల్‌కల్ మండలంలోని డప్పూరు, వడ్డి, మాల్గి గ్రామాల్లో ఫార్మాసిటీ పేరిట బంగారం లాంటి రెండువేల ఎకరాల భూములను రైతుల నుంచి బలవంతంగా లాక్కోవటం దారుణమన్నారు. అసైన్డ్‌భూములున్న రైతులకు పట్టాలిస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ హామీ ఇచ్చి ప్రజల నుంచి ఓట్లు పొంది అధికారంలోకి వచ్చారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ ఇప్పుడు న్యాల్‌కల్ రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్‌రెడ్డి పాలన మారిందని ఎద్దేవా చేశారు. రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటే బీఆర్ఎస్ చూస్తూ ఉరుకోదని హెచ్చరించారు. భూసేకరణ కోసం జేసీబీలు, పొక్లెయిన్‌లు వస్తే తనతోపాటు ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి డప్పూరులోనే మకాంవేసి భూసేకరణను అడ్డుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. రైతులు మాత్రం ఒక్కమాటమీద ఉండాలని, బ్రోకర్లను నమ్మి మోసపోవద్దని సూచించారు. కోహీర్ జామ, డప్పూరు పుదీన అంటే బోయిన్‌పల్లి మార్కెట్, బీదర్‌లో ఫేమస్ అని గుర్తు చేశారు. మూడు గ్రామాల రైతులు ఏకమై పోరాడితే ఫార్మాసిటీ రద్దవడం ఖాయమని సూచించారు.

మూసీని ఉద్ధరించి.. మంజీరను విషతుల్యం చేస్తవా

మూసీని శుద్ధిచేసి గోదావరి జలాలు కలుపుతామంటున్న రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ కంపెనీలతో మంజీర నదిని విషతుల్యం చేస్తవా అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. పాలలాంటి మంజీరా నీళ్లలో విషం కలుపుతవా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషితమైన మంజీర నీటిని హైదరాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు ఎలా తాగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఫార్మాసిటీ భూసేకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సర్కార్ డప్పూరులో చెరువులు తవ్వించటంతోపాటు కొత్తగా సబ్‌స్టేషన్ నిర్మిస్తే రేవంత్‌రెడ్డి సర్కార్ రైతుల భూములు లాక్కుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరిస్తే సహించేదిలేదన్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు దేవీప్రసాద్, మాణిక్యం, బుచ్చిరెడ్డి, మామిళ్ల రాజేందర్, హకీం, నరహరిరెడ్డి, వీరారెడ్డి, మాజీ సర్పంచ్ రవి పాల్గొన్నారు.

> అయ్యా.. ఈ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం మా భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తున్నది. సారవంతమైన భూములను సర్కారుకు ఇచ్చి మేమెట్ల బతకాలే. ఫార్మాసిటీ వస్తే నీళ్లు కలుషితమైతయి..మా ఆరోగ్యాలు దెబ్బతింటయి..మాకు అండగా నిలవాల్సిన సర్కారే.. ఇలా ఇబ్బంది పెడితే మా జీవితాలు ఏం కావాలే. ప్రాణాలైన ఇస్తం..కానీ మూడు పంటలు పండే ఈ భూముల్ని వదులుకోం..
>
> **-డప్పూర్ గ్రామ పర్యటనలో హరీశ్‌రావుతో పలువురు రైతుల కన్నీటి ఆవేదన**

భూముల పరిశీలన

ఫార్మాసిటీలో రైతులు కోల్పోతున్న భూములను మాజీ మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి భారీ కాన్వాయ్‌తో వచ్చిన హరీష్‌రావుకు బీఆర్ఎస్ నాయకులు, డప్పూరు, వడ్డి, మాల్గి గ్రామాల రైతులు ఘన స్వాగతం పలికారు. అక్కడ పత్తి, కంది, చెరుకు, పుదీనా తదితర పంటలను చూశారు. ఈ సందర్భంగా మహిళా రైతులు రేవంత్ సర్కార్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

హరీశ్‌రావు: అమ్మా మీ పేరేంటి? ఎన్ని ఎకరాల భూమి పోతున్నది?

సర్ నాపేరు శరణమ్మ, నాకు రెండెకరాల భూమి ఉంది. వారసత్వంగా వచ్చిన ఈ భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్న. పొలం కాడ బావి ఉంది. మూడు పంటలు పండిస్తా. పత్తి, చెరుకు, పుదీనా పంట వేస్త. ఏడాదికి రెండు నుంచి మూడు లక్షల ఆదాయం వస్తున్నది. ఇప్పుడు ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం మా భూములు లాక్కుంటమని అంటున్నది. ప్రాణమైనా ఇస్తం కానీ భూములు మాత్రం ఇయ్యం.

హరీశ్‌రావు: ఫార్మాసిటీకి భూములు పోకుండా మేం చూస్తం.

మీకు రైతుబంధు వస్తుందా అమ్మా?

శరణమ్మ: లేదు సార్ ఇప్పటి వరకు రైతుబంధు పడలేదు. కేసీఆర్ సర్కార్‌లో ఏటా రెండుమార్లు టైంకు రైతుబంధు డబ్బులు పడ్డయి. పింఛన్ డబ్బులు తంచన్‌గా వచ్చినయి. రేవంత్‌రెడ్డి వచ్చాక మా రైతుల ఉసురుతీస్తుండు సర్.

హరీశ్‌రావు: అమ్మా నీపేరేంటి? నీ భూమి ఫార్మాసిటీలో పోతున్నదా?

సర్ నాపేరు లక్ష్మి. నాకున్న రెండెకరాలూ ఫార్మాసిటీలో పోతున్నది. మూడు పంటలు పండేవి. మేం పుదీనా వేసినం. మంచి ఆదాయం వస్తున్నది. మాకున్న ఆధారమే ఈ భూమి. ప్రాణాలు పోయినా ఫార్మాసిటీకి భూములియ్యం.

హరీశ్‌రావు: అధైర్యపడకండి.. మీకు అండగా నేనుంట. మీ అనుమతి లేకుండా ఫార్మాసిటీకి భూములు పోనివ్వ.

హరీశ్‌రావు: అమ్మా నీపేరేంటి? పంటలపై ఎంత సంపాదిస్తారు?

సర్ నాపేరు లలిత. మా కుటుంబానికి ఇక్కడ రెండెకరాలు ఉంది. పుదీనా, ఇతర పంటలు వేస్తం. ఏడాదికి రెండు నుంచి మూడు లక్షల రూపాయలు సంపాదిస్తం. మా జీవనాధారాన్ని లాక్కుంటమంటే మేం ఎట్ల బతకాలే.

హరీశ్‌రావు: అమ్మా..మీ భూములు ఎక్కడికీ పోవు. మేం అండగా ఉంటం. మీరే కాదు. డప్పూరు, మాల్గి, వడ్డీ గ్రామాల రైతులు ఎవ్వరూ అధైర్యపడొద్దు. బీఆర్ఎస్ పార్టీ ఉంది. అవసరమైతే న్యాయపోరాటం చేస్తం.

భూములు పోతే బతుకుడెట్ల?

సారవంతమైన భూములు పోతే మేమెట్ల బతుకుతం. జీవనాధారమైన భూములను ఫార్మాసిటీకి లాక్కుంటే కుటుంబమంతా రోడ్డునా పడాలా. మాకున్న రెండెకరాల భూమిల ఏడాది పొడవున పుదీనాను సాగు చేసుకుంటున్నం. ప్రాణాలు పోయినా ఫార్మాసిటీకి మాత్రం భూములు ఇవ్వం.

- లక్ష్మి, బాధిత మహిళ, డప్పూర్, న్యాల్‌కల్ మండలం (సంగారెడ్డి జిల్లా)

మారొట్టె తిని మమ్మల్నే తరుముతున్నడు

మా నాయన నుంచి నాకు ఐదెకరాల భూమి అచ్చింది. రూపాయి రూపాయి కూడ బెట్టి, చెమట దారబోసి, బావితవ్వించిన. ఇప్పుడు నాభూమి లాక్కుంటమంటే నిద్రపడుత లేదు. ఈ భూమిలో పంటలు తీసి ఇద్దరు కొడుకులు, బిడ్డ లగ్గం జేసిన. ఇప్పుడు పొలాన్ని రేవంత్‌రెడ్డి లాక్కుంటుంటే కడుపు మండుతున్నది. మేము వేసిన రొట్టె తునక తోని రేవంత్ రెడ్డి బతుకుతుండు. మారొట్టె తిని మమ్మల్ని తరుముతున్నడు. రేవంత్‌రెడ్డి ఇది ఇస్తా అది ఇస్తా అని మాయజేసిండు. ఇప్పుడు మమ్ముల్ని మోసం చేస్తుండు. ఫార్మా కంపెనీలకు భూములియ్యం.

-హన్మంతు, రైతు, డప్పూర్, న్యాల్‌కల్ మండలం (సంగారెడ్డి జిల్లా)

దసరాలోగా 2 లక్షలకుపైగా రుణ మాఫీ

- 2 లక్షలలోపు ఇప్పటికే మాఫీ
- రవాణా శాఖ మంత్రి పొన్నం

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.2 లక్షలలోపు రుణం ఉన్న రైతులకు మాఫీ చేసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రూ.2 లక్షల పైన ఉన్న వారికి దసరాలోపు మాఫీ అవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గురువారం కరీంనగర్ రూరల్ మండలం తాహెర్ కొండాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉండి ఎక్కడైనా రుణమాఫీ కాకపోతే అధికారులకు వివరాలు ఇవ్వాలని సూచించారు. డిజిటల్ కార్డు వివరాల నమోదులో ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు.

గ్రూప్ -1 పై సీఎం సోయిలేని మాటలు!

- పరీక్షలు కాకముందే ఫలితాలెలా ఇస్తామంటరు
- పోస్టులకు బేరం పెట్టుకున్నారే మోనని అనుమానం
- వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): గ్రూప్ 1పై సీఎం రేవంత్‌రెడ్డి సోయిలేని మాటలు మాట్లాడుతున్నారని వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కే వాసుదేవరెడ్డి విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చూస్తుంటే అనేక అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. త్వరలో గ్రూప్ 1 నియామక ఫలితాలు విడుదల చేస్తామని ఇటీవల సీఎం ప్రకటించారని, గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరగకముందే ఫలితాలెలా ఇస్తారని ప్రశ్నించారు. కొంపదీసి గ్రూప్ 1 పోస్టులు ఉంచారా? బేరం పెట్టుకున్నారా? అనే సందేహాన్ని వ్యక్తంచేశారు. సీఎం వ్యవహారం.. పిల్ల పుట్టక ముందే కుల్ల కుట్టినట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీఆర్ఎస్‌వై నాయకులు విద్యాసాగర్, మధు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోళ్లపై దృష్టిపెట్టాలి

- సన్న ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్
- వీసీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి క